## క్లుప్తంగా

### గాయపడిన ఆబోతు తాటిపాకకు తరలింపు

మామిడికుదురు: నగరం గ్రామంలోని 216వ నంబర్ జాతీయ రహదారి పక్కన ఆబోతును గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆబోతును ఎవరూ పట్టించుకోక పోవడంతో విషయం తెలుసుకున్న విశ్వహిందూ పరిషత్ కోనసీమ జిల్లా సహకార్యదర్శి రాజా నాగరత్నకుమార్, భజరంగ్‌దళ్ నాయకులు సిరంగు నాయుడు, సూరిశెట్టి స్వామినాయుడు ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం బుధవారం అక్కడకు చేరుకుంది. మామిడికుదురు వెటర్నరీ వైద్యులు చేగొండి శ్రీరామ్ ఆబోతుకు ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం ఆబోతును మెరుగైన వైద్యం కోసం క్రేన్ సహాయంతో వాహనం ఎక్కించి రాజోలు మండలం తాటిపాక వెటర్నరీ ఆస్పత్రికి పంపించారు.

### విద్యార్థులకు కిట్ల పంపిణీ

ఆలమూరు: వివిధ పాఠశాలలకు సంబంధించిన విద్యార్థులకు కిట్ల పంపిణీ జరిగింది. స్థానిక డాక్టర్ బొబ్బా జయశ్రీ బాలికోన్నత పాఠశాల ఆవరణలో సర్పంచ్ నేలపూడి లావణ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పలువురు నేతలు పాల్గొని ఈ స్టూడెంట్ కిట్లను అందజేశారు. ఇంద్రికపేట, శెట్టిబలిజపేట, కొత్తూరు ప్రాథమిక పాఠశాల, జీసీఎస్, జిల్లెల్లపేట పాఠశాలలకు సంబంధించిన విద్యార్థులు ఈ కిట్లను తీసుకున్న వారిలో ఉన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ ఈదల నల్లబాబు, మాజీ జెడ్పీటీసీ రామానుజుల శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

### వుడయార్‌కు కోడి రామకృష్ణ ప్రతిభా పురస్కారం



శిల్పి రాజ్‌కుమార్‌ను సత్కరిస్తున్న సినీనటుడు మురళీమోహన్

కొత్తపేట: ప్రముఖ అంతర్జాతీయ శిల్పి డాక్టర్ డి.రాజ్‌కుమార్‌వుడయార్ ప్రముఖ సినీ డైరెక్టర్ కోడి రామకృష్ణ ప్రతిభా పురస్కారం అందుకున్నారు. లెజెండరీ డైరెక్టర్‌గా ఖ్యాతి గడించిన కోడి రామకృష్ణ 75వ జయంతి సందర్భంగా ఆయనతో కలసి పనిచేసిన డైరెక్టర్స్, నటీనటులు, వివిధ రంగాల ప్రతిభావంతులను కోడి రామకృష్ణ ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం మంగళవారం రాత్రి హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్‌లో ఘనంగా నిర్వహించారు. దానిలో భాగంగా కొత్తపేట నుంచి శిల్ప కళారంగంలో అంతర్జాతీయ ఖ్యాతి గడించిన శిల్పి రాజ్‌కుమార్‌ను సీనియర్ హీరో మురళీ మోహన్ తదితర ప్రముఖుల చేతుల మీదుగా ప్రతిభా పురస్కారంతో సత్కరించారు. శిల్పి రాజ్‌కుమార్ బుధవారం మాట్లాడుతూ కోడి రామకృష్ణ పేరున ప్రతిభా పురస్కారాన్ని అందుకోవడం ఆనందంగా ఉందన్నారు.

### ఆకస్మిక తనిఖీ

ఆలమూరు: స్థానిక ఇంటిగ్రేటెడ్ హాస్టల్ ఆకస్మిక తనిఖీ జరిగింది. స్థానిక బోణువు చెరువు సమీపంలోని ఈ హాస్టల్‌కు మంగళవారం రాత్రి జిల్లా ఎస్సీ సంక్షేమ, అభివృద్ధి అధికారిణీ జీజే లక్ష్మీదేవి హఠాత్తుగా హాస్టల్‌కు విచ్చేసి విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యార్థుల సంఖ్య తక్కువ ఉండటంపై ఆమె అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలోని వివిధ హాస్టళ్లలో వేధిస్తున్న సిబ్బంది కొరతను అధిగమించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలోని హాస్టల్స్ అన్నింటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

### రోడ్ల అభివృద్ధికి నిధులు విడుదల చేయాలి



రోడ్ల అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను మంత్రికి అందజేసిన ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం: నియోజకవర్గంలో రోడ్ల ఆధునీకరణకు నిధులు విడుదల చేయాలని ఆర్అండ్‌బీ శాఖ మంత్రి జనార్దన్‌రెడ్డికి ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. అమరావతిలో మంత్రిని బుధవారం ఎమ్మెల్యే గిడ్డి కలిశారు. నియోజకవర్గంలో మొత్తం 17 రోడ్ల అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలు మంత్రికి అందజేశారు. దీనిపై మంత్రి జనార్దనరెడ్డి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే గిడ్డి స్థానిక విలేకరులకు తెలిపారు.

### ఘనంగా జాతీయ విద్యావిధానం వార్షికోత్సవాలు

రాజోలు: జాతీయ విద్యావిధానం నాలుగో వార్షికోత్సవాన్ని బుధవారం మండలంలోని పలు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమాలను సమగ్ర శిక్షా ఎస్పీడీ రాష్ట్ర నోడల్ అధికారి బి.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకు నిర్వహిస్తామని ఎంఈఓ నల్లి మనోహరం తెలిపారు. పాఠశాల విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. సమగ్ర శిక్షా సీఎంఓ బొరుసు సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో తొక్కుడు బిళ్ల, దాగుడుమూతలు, చుక్కలాట, తాడు ఆట వంటి 75 రకాల గ్రామీణ క్రీడలను ఆడించారు. ప్రధానోపాధ్యాయులు కె.సరస్వతి, ఓలేటి అన్నపూర్ణ, లలితకుమారి తదితరులు పాల్గొన్నారు.



కె.ఏనుగుపల్లి రహదారిపై వరదనీటిలో ఆగిపోయిన బైక్‌ను సాయం పడుతున్న దృశ్యం



అప్పనపల్లిలో పాక చుట్టూ చేరిన వరద నీరు



పి.గన్నవరం మండలంలో ఆవును సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్న దృశ్యం



అప్పనరామునిలంక ఓఎన్జీసీ కాలనీలో తాగునీరు సరఫరా చేస్తున్న అధికారులు

# గోదావరీ

- లంక గ్రామాల ప్రజలకు తప్పని అవస్థలు
- చుట్టుముట్టిన గోదావరి వరద

మామిడికుదురు: గోదావరి వరద ఉధృతితో లంక గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ప్రధాన రహదారులను వరద నీరు ముంచెత్తడంతో తీర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాశర్లపూడి కరకట్ట దిగువన ఉన్న అప్పనపల్లి కాజ్‌వేపై భారీగా వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో ఈ రహదారిని పూర్తిగా మూసివేశారు. మామిడికుదురు శివారు కొర్లగుంట మీదుగా అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాల ప్రజలు ముంపు నీటిలో దిగి తీవ్ర ఇబ్బందుల నడుమ ప్రయాణాలు సాగిస్తున్నారు. వరద నీరు పోటెత్తడంతో అప్పనపల్లి బాల బాలాజీ స్వామి ఆలయంలో దర్శనాలను రద్దు చేశారు. పెదపట్నంలోని అరుంధతీపేట, పాశర్లపూడి, పాశర్లపూడిలంక గ్రామాల సరిహద్దులోని మత్స్యకార పేటలను వరద ముంచెత్తింది. అప్పనపల్లి కాలనీతో పాటు మొల్లేటివారిమెరకను వరద ముంచెత్తింది.

**గ్రామాల్లో పెరిగిన వరద ఉధృతి**

సఖినేటిపల్లి: మండలంలో టేకిశెట్టిపాలెం, అప్పనరామునిలంక, సఖినేటిపల్లిలంక, సఖినేటిపల్లి గ్రామాల్లో వరద తీవ్రత పెరిగింది. ప్రధానంగా ఆయా గ్రామాల్లో వరద నీరు భారీగా పోటెత్తి రాకపోకలు స్తంభించాయి. సఖినేటిపల్లి లంక పరిధిలోని రేవు వద్ద వశిష్ట గోదావరి నదిని ఆనుకుని ఉన్న పూరిళ్లు జలమయమయ్యాయి. స్థానిక బస్టాండ్ ఏరియా అంతా వరద పోటెత్తింది. సఖినేటిపల్లి పంచాయతీ పరిధిలోని లాకుపేటలో వరద ముంచెత్తడంతో సమీప నివాస గృహాల నుంచి బయటకు రాకపోకలు నిలిచిపోయాయి. ప్రత్యేకాధికారి సిద్ధార్థ వర్ధన్, ఎంపీడీవో పీవీ సత్యనారాయణ, డీటీ సీహెచ్ భాస్కర్ సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఏటిగట్టుకు దిగువన టేకిశెట్టిపాలెం పరిధిలోని అగ్నికుల క్షత్రియ కాలనీ పూర్తిగా జలదిగ్బంధంలో ఉంది. అప్పనరామునిలంకలో కొత్తలంక, ఓఎన్జీసీ కాలనీ పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. పల్లిపాలెం, కొత్తపేట, సుందరవారి మెరక, చింతావారి మెరక, మధ్యగ్రూపు, దివ్వివారి మెరక, తూర్పులంక తదితర ఏరియాలకు వరద ముంపు నీరు చుట్టుముట్టింది. సఖినేటిపల్లి కాజ్ వే వైపునకు ఉన్న మార్గం కూడా జలదిగ్బంధంలో చిక్కుకుంది. గ్రామస్తులు రామరాజులంక మీదుగా ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నారు. ఇదిలా ఉండగా అప్పనరామునిలంకలో ఇళ్లకే పరిమితమైన వారికి ఏవో పీవీ నరసింహరావు, ఏపీవో నాగప్రసాద్, కార్యదర్శి ఎ.గంగరాజు, సచివాలయ స్టాఫ్ ఓలేటి శ్రీనివాస్, తులసీరాం, టిన్సింగ్‌బాబు పడవలపై వెళ్లి టిన్‌ల ద్వారా తాగునీటి సరఫరా చేశారు.

**నిలకడగా కొనసాగుతున్న వరద ఉధృతి**

పి.గన్నవరం: ఎగువ ప్రాంతాల్లో తగ్గుముఖం పట్టినప్పటికీ వశిష్ట, వైనతేయ నదీపాయల్లో వరద ఉధృతి నిలకడగా కొనసాగుతోంది. మండలంలోని కె.ఏనుగుపల్లి, మానేపల్లి శివాయలంకలకు వెళ్లే రహదారులపై వరదనీరు ప్రవహిస్తోంది. ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, బూరుగులంక, అరిగెలవారిలంక గ్రామాల ప్రజలు వరద ఉధృతిలో ఇంజిన్ పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు.



అప్పనరామునిలంకలో వరద ముంపులో ఒక ఇల్లు

బూరుగులంకకు వెళ్లే దారిలో ఏటిగట్టు దిగువన పాయలోకి నీరు చేరడంతో అక్కడ సిమెంటు రోడ్డు మునిగిపోయింది. ఊడిమూడిలంక వంతెన నిర్మాణ సైటును వరదనీరు చుట్టుముట్టడంతో పనులకు బ్రేక్ పడింది. అలాగే సరిహద్దు జిల్లాకు చెందిన పెదమల్లంక, ఆనగర్లంక, సిర్రావారిలంక, చాకలిపాలెం శివారు కనకాయలంక గ్రామాల ప్రజలు ఇంజిన్ పడవలపై ప్రయాణిస్తున్నారు. పుచ్చల్లంక నుంచి నాగుల్లంక పల్లిపాలెంనకు వెళ్లే రహదారి నీట మునగడంతో ప్రజలు పడవలను ఆశ్రయించారు. వరదలతో లంక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వరద ముంపు ప్రాంతాల్లో కొత్తపేట ఆర్డీఓ జీవీవీ సత్యనారాయణ, తహసీల్దార్ షేక్ హుస్సేన్, ఎంపీడీఓ త్రిశూలపాణి, ఆర్ఐ నర్సింహారావు తదితరులు పర్యటించారు.

### అయినవిల్లిలంక కాజ్‌వే వద్ద కొనసాగుతున్న వరద ఉధృతి

అయినవిల్లి: ముక్తేశ్వరం–అయినవిల్లిలంక ఎదురుబిడెం కాజ్‌వే వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. కాజ్‌వే పై ఆరు అడుగుల లోతు వరద ప్రవహిస్తుంది. వీరవల్లిపాలెం, అయినవిల్లిలంక, కపిలేశ్వరపురం మండలం పరిధిలో అద్దంకివారిలంక ప్రజలు కాజ్‌వేపై పడవల సాయంతో రాకపోకలు సాగిస్తున్నారు. నిత్యావసరాల కోసం, వ్యవసాయ ఉత్పత్తులు తరలించడం కోసం పడవలను ఆశ్రయిస్తున్నారు. ముక్తేశ్వరం వృద్ధగౌతమిపాయలో వరద ఉధృతి పెరిగింది. రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తున్నారు. వీరవల్లిపాలెం, అయినవిల్లిలంక, పొట్టిలంక, కొండుకుదురులంక గ్రామాల్లో లోతట్టు ప్రాంతాల్లో ఇళ్ల మధ్యకు వరదనీరు చేరింది.



ఊడిమూడిలంకలో నిర్మాణంలో ఉన్న వంతెన సైటును చుట్టుముట్టిన వరద



పాశర్లపూడిలో ముంపునకు గురైన కనకదుర్గమ్మ ఆలయం

## మలికిపురం రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం



మలికిపురం రోటరీ క్లబ్ అధ్యక్షురాలు ఝాన్సీని అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాపాక

మలికిపురం: 30 ఏళ్లుగా మలికిపురం రోటరీ క్లబ్ అందిస్తున్న సామాజిక సేవలు అభినందనీయమని రాజోలు మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. బుధవారం మలికిపురం వీఆర్‌కే ఫంక్షన్ హాల్‌లో నూతన అధ్యక్షురాలిగా బత్తుల ఝాన్సీబాయి, కార్యదర్శిగా మట్టా రవికుమార్, కోశాధికారిగా తోలేటి సతీష్ ప్రమాణ స్వీకారం చేశారు. ఇన్‌స్టలేషన్ అధికారి రొటేరియన్ డాక్టర్ బసవ వరహాలు వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ముఖ్యఅతిథిగా రాపాక మాట్లాడుతూ, రాబోయే కాలంలో నూతన అధ్యక్షురాలు ఝాన్సీ రోటరీ ఆశయాలను, లక్ష్యాలను నెరవేర్చే దిశగా తగిన కృషి చేస్తారన్నారు. ఈ మేరకు ఝాన్సీని ఆయన పుష్పగుచ్ఛంతో అభినందించారు. అసిస్టెంట్ గవర్నర్ మిరియాల శ్రీనివాసరావు, పాస్ట్ అసిస్టెంట్ గవర్నర్ నల్లి శివకుమార్, ఎంపీపీ మేడిచర్ల సత్యవాణి, రొటేరియన్లు పాల్గొన్నారు.

## కనకదుర్గమ్మకు ఆషాఢం సారె సమర్పణ



అంబాజీపేట నుంచి ఆషాఢం సారె తీసుకువెళ్తున్న భవానీలు

అంబాజీపేట: విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన కనకదుర్గమ్మకు అంబాజీపేట భవానీ సేవా సమితి ప్రతినిధులు బుధవారం ఆషాఢమాసం సారె సమర్పించారు. 27 రకాలతో తయారు చేయించిన 75 కిలోల స్వీట్లను అమ్మవారికి సమర్పించారు. గురు భవానీలు దంగేటి మల్లేశ్వరి–సాయిబాబు దంపతులు, మట్టపర్తి ఏసు, మట్టపర్తి దుర్గాప్రసాద్, కేతా దొరలతో పాటు సేవా సమితి సభ్యుల ఆధ్వర్యంలో అమ్మ వారికి పసుపు, కుంకుమ, చలివిడితో కూడిన సారె, చీరలను అమ్మవారికి చెల్లించారు. ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, పంటలు సమృద్ధిగా పండాలని, అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఈ సందర్భంగా అమ్మ వారిని ప్రార్థించారు. కార్యక్రమంలో కట్టా కట్టప్ప, కె.సుబ్రహ్మణ్యం, పాటి శేఖర్, ఎం.సూర్యప్రకాష్, కె.రమణ తదితరులు పాల్గొన్నారు.

## విలసలో 'డాక్ చౌపల్'

అయినవిల్లి: మండలంలోని విలస పోస్టాఫీసు కార్యాలయం వద్ద కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించబడుచున్న 'డాక్ చౌపల్' కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విలసలోని ప్రజలకు పోస్టాఫీసు ద్వారా ఆధార్ స్పెషల్ కౌంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కొత్తపేట పోస్టల్ ఇన్‌స్పెక్టర్ కె.అమరనాథ్ మాట్లాడుతూ ప్రజలకు పోస్టాఫీసు ద్వారా లభించే అన్ని సర్వీసులు, పథకాల గురించి అవగాహన కల్పించారు. విలస పోస్టాఫీసు నందు 20 నూతన సేవింగ్స్ ఖాతాలు, రూ.1,00,000 పోస్టల్ ఇన్సూరెన్స్ ప్రీమియం వసూలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాకినాడ బ్రాంచ్ మేనేజర్ రాజ్‌కుమార్, విలస సబ్ పోస్ట్‌మాస్టర్ రామనారాయణ, మెయిల్ ఓవర్సీర్ రాహుల్, తపాలా సిబ్బంది పాల్గొన్నారు.

## సంకటహర చతుర్థి పూజలు

అయినవిల్లి: అయినవిల్లిలోని విఘ్నేశ్వరస్వామి ఆలయంలో బుధవారం సంకటహర చతుర్థి పూజలు వైభవంగా జరిపారు. ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో వేదపండితులు స్వామికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేకంగా హోమం జరిపించారు. స్వామిని మూషిక వాహనంపై ఆశీసులు గావించి ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. ఈ పూజల్లో 92 మంది భక్తులు పాల్గొన్నారు. వారికి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. నల్లచెరువు గ్రామంలోని గణపతి ఆలయంలోనూ సంకటహర చతుర్థి పూజలు జరిగాయి.

## హెల్మెట్ ధారణతో ప్రాణరక్షణ



కొత్తపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి రమణారెడ్డి, న్యాయవాదులు

కొత్తపేట: ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని స్థానిక సీనియర్ సివిల్ జడ్జి పి.రమణారెడ్డి సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు బుధవారం సీనియర్ సివిల్ జడ్జి రమణారెడ్డి ఆధ్వర్యంలో హెల్మెట్ ధారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కోర్టుల సముదాయం నుంచి వాడపాలెం సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వాహనాల డ్రైవింగ్, జాగ్రత్తలు, ముఖ్యంగా హెల్మెట్‌ధారణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటిస్తే ప్రయాణం సుఖవంతమవుతుందన్నారు. హెల్మెట్ ధరించకపోతే రూ.5 నుంచి రూ.10 వేల వరకూ జరిమానా విధించడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ ప్రక్రియ ఈ నెల 1 నుంచి అమల్లోకి వచ్చిందన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు అల్లు భాస్కరరావు, అడబాల ప్రభాకరరావు, కోర్టు సిబ్బంది, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ధారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ డీసీహెచ్ పాపారావు ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పెద్దిరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎస్సై జ్వాలాసాగర్ హెల్మెట్‌ధారణ ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొత్తపేట: మండలంలో అవిడి గ్రామానికి గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆ శాఖ అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ తెలిపారు. ఆర్‌డీఎస్ఎస్ పనులు చేసే నిమిత్తం అవిడి పంచాయతీ పరిధిలోని పుల్లెలవారిపేట గ్రామానికి ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ రవికుమార్ తెలిపారు. విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.


**రాజోలు మండల పరిధిలో రేపు..**

రాజోలు: మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 26న విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్ బుధవారం తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ లైన్లపైకి వచ్చిన చెట్ల కొమ్మలు నరికివేత పనులు చేపడుతున్నామన్నారు.

**అయినవిల్లి సబ్‌స్టేషన్ పరిధిలో..**

అయినవిల్లి: అయినవిల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు గురువారం రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.రవికుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకూ రెండు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. అయినవిల్లి, ముక్తేశ్వరం, అయినవిల్లిలంక, కె.జగన్నాథపురం, మడుపల్లి, మాగం, నేదునూరు, నల్లచెరువు, వీరవల్లిపాలెం, తొత్తరమూడి, సిరిపల్లి, విలస గ్రామాలకు ఈ సమయంలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ సమయంలో చింతనలంక్ కొత్త ఫీడర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## రోగికి రూ.22,200 ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న శెట్టిబలిజ సంఘం ప్రతినిధులు

మామిడికుదురు: బ్రెయిన్ సమస్యతో బాధపడుతున్న లూటుకుర్రు గ్రామానికి చెందిన బొంతు బుజ్జికి శెట్టిబలిజ సంఘం బుధవారం రూ.22,200 ఆర్థికసాయం అందజేసింది. మండల శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు కాంద్రేగుల శ్రీనివాస్, కోశాధికారి పెచ్చెట్టి సత్యచంద్ర, సంయుక్త కార్యదర్శి కడలి నూకరాజు బుధవారం లూటుకుర్రులో బుజ్జి ఇంటికి వెళ్లి ఈ సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో రాజోలు తాలూకా శెట్టిబలిజ సంఘం ప్రధాన కార్యదర్శి గుబ్బల మనోహర్, కన్వీనర్ గుబ్బల శ్రీనివాస్, సంఘం ప్రతినిధులు వాసంశెట్టి రామకృష్ణ, చింతపల్లి సతీష్, చప్పిడి సూరిబాబు పాల్గొన్నారు.

## నల్లచెరువులో కాటన్ వర్ధంతి

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో సర్ ఆర్థర్ కాటన్ జయంతిని బుధవారం ఘనంగా జరిపారు. కాటన్ విగ్రహానికి రైతు నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కాటన్ సేవలను గుర్తు చేశారు. ఆయ నవల్లే ఈ ప్రాంతాల్లో అన్నానికి లోటు లేదన్నారు.

## హిమాన్షుశుక్లా వారధితో ముంపు కష్టాలకు చెక్

**పూర్వ కలెక్టర్‌కు కృతజ్ఞతల వెల్లువ**



అప్పనపల్లిలో నిర్మించిన హిమాన్షుశుక్లా వారధి

మామిడికుదురు: ధవళేశ్వరంలో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ కాగానే మూడు లంక గ్రామాల ప్రజలకు వరద కష్టాలు ప్రారంభమయ్యేవి. అప్పటి నుంచి వరద తగ్గే వరకు ముంపు నీటిలో పడవలపై రాకపోకలు సాగించాల్సి వచ్చేది. గ్రామాల్లోకి వరద నీరు ప్రవేశించకుండానే గ్రామ సరిహద్దులోని అప్పనపల్లి కాజ్‌వేతో పాటు మామిడికుదురు కొర్లగుంట శివారు తొట్టి వంతెన ముంపుబారిన పడేది. తొట్టి వంతెన వద్ద వరద ఉప్పొంగి ప్రవహించడంతో కష్టాలు తప్పేవి కాదు. ఇది ఒకప్పటి లెక్క. కానీ లెక్క మారింది. నేడు ఆ పరిస్థితి లేదు. రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేసినా ఎటువంటి భయం లేకుండా రయ్ మంటూ వేలాది మంది ప్రజలు బైక్‌లు, కార్లపై దూసుకుపోతున్నారు. పూర్వ జిల్లా కలెక్టర్, ప్రస్తుత ఐఅండ్‌పీఆర్ డైరెక్టర్ హిమాన్షు శుక్లా చొరవతో సుదీర్ఘ కాలం నాటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. గోదావరి వరద బాధితుల కష్టాలు రెండేళ్ల క్రితం స్వయంగా ట్రాక్టర్‌లో వచ్చి పరిశీలించి శుక్లా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారు. అప్పనపల్లి పాటురేవుపై దశాబ్దాల క్రితం నిర్మించిన తొట్టి వంతెనను సమూలంగా తొలగించి దాని స్థానే పక్కా వంతెన నిర్మించారు. ప్రస్తుతం ఆ వంతెన మూడవ ప్రమాద హెచ్చరిక జారీ చేసినా ఎటువంటి ముంపు సమస్య లేకుండా ఎంతో ఎత్తులో దాన్ని నిర్మించారు. ఈ వారధికి ఎటువంటి నిధులు లేవు. కేవలం శుక్లా చొరవతో రూ.54 లక్షలు ప్రైవేటుగా సేకరించి ఈ బృహత్తర కార్యక్రమం చేపట్టారు. తద్వారా తీర గ్రామాల ప్రజల మన్ననలు అందుకున్నారు. కలెక్టర్ కృషికి ఫలితంగా నిర్మించిన ఈ వారధికి హిమాన్షు శుక్లా వారధిగా తీర గ్రామాల ప్రజలు నామకరణం చేయడం విశేషం. నాడు శుక్లా నిర్మించిన వారధి నేడు ఎంతో మంది తీర గ్రామాల ప్రజల ముంపు కష్టాలను తొలగించింది. దీంతో ప్రతి ఒక్కరూ శుక్లా సేవలను గుర్తు చేసుకుంటున్నారు.

### ముంపు కష్టాలు తొలగిపోయాయి



రెండేళ్ల క్రితం గోదావరి వరద పరిస్థితిని స్వయంగా పరిశీలించిన కలెక్టర్ హిమాన్షు శుక్లా బాధితుల పరిస్థితి చూసి ఎంతో చలించి పోయారు. వరద నీటిలో దిగి రావడం, ట్రాక్టర్లపై బాధితుల రాకపోకలు వంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టారు. వరదలు తగ్గిన వెంటనే ఇంజినీరింగ్ అధికారులతో ప్రతిపాదనలు రూపొందించి ప్రజలకు సురక్షితంగా ఉండే విధంగా వారధి నిర్మించి లంక గ్రామాల ప్రజలకు ముంపు కష్టాలు తొలగించారు. అందుకే దానికి హిమాన్షు శుక్లా వారధిగా నామకరణం చేశాం.

– గెద్దం మంగాలక్ష్మి, సర్పంచ్, అప్పనపల్లి

### వేలాది మందికి మేలు జరిగింది



అధికారులు వస్తారు. వెళ్తుంటారు. కానీ కొందరే ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం ఏర్పరచుకుంటారు. ఆ కోవకు చెందిన వ్యక్తే హిమాన్షు శుక్లా. ఆయన చొరవతోనే ఎవరికీ సాధ్యం కాని వారధి నిర్మాణమైంది. గతంలో ఎంతో మంది ప్రజా ప్రతినిధులు హామీ ఇచ్చిన సాకారం కాని వారధి నిర్మాణం శుక్లా చొరవతోనే కార్యరూపం దాల్చింది. గోదావరి వరద సమయంలో శుక్లా పేరు మారు మోగుతోంది. ప్రతి ఒక్కరూ ఆయన చొరవను అభినందిస్తున్నారు. అటువంటి ఉద్యోగులను ఎప్పటికి మర్చిపోలేం. అంతటి మహత్తర కార్యం ఆయన పూర్తి చేశారు. శుక్లా గారికి హ్యాట్సాప్ చెబుతున్నాం.

– వేగి నాగమణి, వార్డు సభ్యురాలు, అప్పనపల్లి